కథ

# పెళ్ళిసందడి

## దానం ఉమాదేవి

"వెయ్యి నూట పదహార్లకు తక్కువ ఎవరూ చదివించవద్దు" మహిళా మండలి మీటింగులోని మహిళలను ఉద్దేశించి చెప్పింది అధ్యక్షురాలు జగదీశ్వరి.

"అమ్మో! వెయ్యినూట పదహార్లే. మావారికొచ్చేదే ఆరువేలు" అన్నది వనజ.

"మా అమ్మాయి పెళ్ళికి చేసిన అప్పే ఇంతవరకూ తీరలేదు. మావల్లకాదు అంత చదివించటం" విమల వంతపాడింది.

"అయినా మాచేతనైంది మేము చదివిస్తాం. అంతేగానీ ఇంతే చదివించి తీరాలి అంటే ఎలా?" ప్రశ్నించింది కాంతం. అందరూ ఆమెకు వంతపాడారు.

అందరినీ ఒకసారి పరికించి చూసి గొంతు సవరించుకున్నది జగదీశ్వరి.

"చెప్పేది పూర్తిగా వినకుండా మధ్యలోనే అడ్డుతగిలితే ఎలా! మీరు ఎంత చదివించదలుచుకుంటే అంతే చదివించండి. ఆ ఎమౌంట్‌ను ఎన్వలప్ కవర్‌లో పెట్టి చదివింపులు చెప్పేటప్పుడు వెయ్యి నూటపదహార్లని చెప్పండి. మగపెళ్ళివాళ్ళం కదా! గ్రాండ్‌గా ఉంటుంది. మీరందరూ మా అబ్బాయి పెళ్ళికొచ్చేటప్పుడు పట్టుచీరలు, జిగేలుమనే నగలతో రావాలి. బంగారునగలు లేకపోతే గిల్టువి కొనుక్కోండి. ఈ జగదీశ్వరి ఇంటజరిగే ఈ వివాహ కార్యక్రమం గురించి అందరూ ఎంతో గొప్పగా చెప్పుకునేలా ఉండాలి"

అర్ధనూట పదహార్లో, నూట పదహార్లో కవరులో పెట్టి వెయ్యినూట పదహార్లు చదివిస్తున్నట్లు చెప్పటం తమకూ గొప్పగానే ఉంటుందనుకున్నారు మహిళా మండలిలోని మిగతా మహిళలు.

జగదీశ్వరి ఆ కాలనీ మహిళామండలి అధ్యక్షురాలు. ఆ కాలనీలో ఆమెకు కొన్ని ఇళ్ళు ఉన్నాయి కూడా. వాటిని అద్దెకివ్వటం ద్వారా వడ్డీ వ్యాపారం ద్వారా జగదీశ్వరి పేరు కాలనీ అంతా తెలుసు. మనిషి మాటకారి. దర్పం ఎక్కువ. భర్త పరమేశం ప్రభుత్వోద్యోగి. ఆ కాలనీకి వచ్చి పరమేశం అడ్రస్ అడిగితే తెలియదనే సమాధానమే వస్తుంది. జగదీశ్వరి అడ్రస్ మాత్రం చిన్నపిల్లాడైనా చెపుతాడు. అదీ ఆమె పాపులారిటీ.

శివాజీ- జగదీశ్వరి ఏకైక సంతానం. బి.టెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తూ నెలకు పాతికవేలు సంపాదిస్తున్నాడు. డబ్బున్న ఇంటిపిల్లను కోడలిగా తెచ్చుకోవాలని ఆమె కోరిక.

కానీ శివాజీ తన కొలీగ్ ప్రశాంతిని ప్రేమిస్తున్నాడు. ఇద్దరూ పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అదే విషయాన్ని తల్లితో చెప్పాడు. పరమేశం అభ్యంతరం చెప్పలేదు. కానీ జగదీశ్వరి మాత్రం ఇంతెత్తున లేచింది.

"పెళ్ళంటూ చేసుకుంటే ప్రశాంతిని చేసుకుంటా. లేదంటే ఇలాగే ఉండిపోతా" అని శివాజీ కరాఖండిగా చెప్పటంతో జగదీశ్వరి దిగిరాక తప్పలేదు.

కట్న కానుకలు ఇవ్వటం తమవల్ల కాదని చేతులెత్తేశారు ప్రశాంతి తల్లిదండ్రులు.

"కనీసం పెళ్ళయినా చేస్తారా? అదీ చేతకాదా" వెటకారంగా అడిగింది జగదీశ్వరి.

పెళ్ళి తామే చేస్తామన్నారు.

"చాలా గ్రాండ్‌గా పెళ్ళి చేయాలి. అమ్మాయికి పాతిక సవర్లన్నా బంగారం పెట్టాలి. మీకు చేతకాకపోతే చెప్పండి పెళ్ళి నేనే జరిపిస్తాను" అన్నది జగదీశ్వరి దర్పంగా.

పెళ్ళి కన్యాదాత చెయ్యటమే ఆచారం కాబట్టి తామే చేస్తామని చెప్పాడు కాబోయే వియ్యంకుడు.

నాలుగురోజుల్లో పెళ్ళి. కాలనీ వాళ్ళందరినీ పెళ్ళికి పిలిచి మూడు బస్సులు ఏర్పాటు చేసింది. అందరూ వంటినిండా నగలతో, పట్టుచీరల రెపరెపలతో దాబుసరిగా ఉండాలని, చదివింపులు 'ఘనంగా' ఉండాలని అందరికీ ముందే చెప్పింది.

పెళ్ళిరోజు రానే వచ్చింది. మూడు బస్‌లు ఒకసారి ఎక్కి అందరినీ పరికించి చూసి తృప్తిగా తలపూపింది జగదీశ్వరి. అందరూ ఆమె కోరికమేరకు ముస్తాబై ఉన్నారు.

బస్‌లకు ముందువైపున 'పెళ్ళిసందడి' అని రాసిన బ్యానర్లు వేలాడగట్టారు. బస్సులు కన్యాదాత ఊరు చేరుకున్నాయి.

ఆడపెళ్ళివాళ్ళు బ్యాండ్‌మేళంతో ఎదురొచ్చి మనిషి మనిషిని పలకరించి కళ్యాణమండపంలోకి తోడ్కొని వెళ్ళారు.

"నాలుగు రూములేం సరిపోతాయి. ఈ ఉక్క భరించటం మా వల్లకాదు. ఎ.సి.రూములు బుక్ చేయండి" ఆజ్ఞాపిస్తున్నట్లుగా చెబుతున్న జగదీశ్వరి మాటలకు ఎదురుచెప్పలేకపోయాడు కాబోయే వియ్యంకుడు.

డెకరేషన్ బాగాలేదని, సౌకర్యాలు సరిగాలేవని ఏదో ఒక లోపం ఎత్తిచూపుతూనే ఉన్నది జగదీశ్వరి.

భోజనాలలో చాలా ఐటమ్స్ వడ్డించారు. వాటి పేర్లు కూడా కొన్ని తెలియటం లేదు. వెంటనే వడ్డించలేదనో, వంటకాలు బాగాలేవనో సణుగుతూనే వున్నది జగదీశ్వరి.

"వంటలు బాగానే ఉన్నాయండి" జగదీశ్వరి చెవిలో గుసగుసగా చెప్పింది కాంతమ్మ.

"మనం మగపెళ్ళివాళ్ళం. వాళ్ళను కాస్త గజగజలాడించాలి. కావల్సినంత తిని మరలా వడ్డించుకొని బాగాలేవని పారెయ్యండి" అన్న జగదీశ్వరిని అదోలా చూసింది కాంతమ్మ.

తమ మీది నుండి వీడియో ఏమాత్రం పక్కకు జరిగినా ఇంతెత్తున ఎగిరిపడుతున్నది. తాను అడిగింది క్షణం లేటైనా చిందులేస్తున్నది.

"మీకు చేతకాదని చెబితే మేమే పెళ్ళి చేసేవాళ్ళం కదా!" అది ఎన్నోసారో జగదీశ్వరి ఆ మాట అనటం.

అప్పటికీ పరమేశం భార్యకు నచ్చచెబుతూనే వున్నాడు అన్నీ బాగానే జరుగుతున్నాయని.

"మన ప్రశాంతి అత్తగారువాళ్ళు బాగా డబ్బున్నవాళ్ళనుకుంటా. ఒక్కొక్కరి ఒంటిమీద ఎంత బంగారమో! మన ప్రశాంతి అదృష్టవంతురాలు" అమ్మాయి తరఫు చుట్టాలు అనుకుంటున్న మాటలు వినగానే గర్వంగా అన్పించింది జగదీశ్వరికి.

మాంగళ్యధారణ కార్యక్రమం అయిపోయింది. తలంబ్రాల అనంతరం మగపెళ్ళి వాళ్ళందరూ వెయ్యి నూటపదహార్లు, ఇంకొంతమంది అత్యుత్సాహంతో ఐదువేల పదహార్లూ చదివిస్తుంటే అందరూ గొప్పగా చెప్పుకోసాగారు.

అప్పగింతల కార్యక్రమం కూడా అయిపోయింది.

తనతోపాటు పెళ్ళికి వచ్చిన వాళ్ళందరికి కూడా బట్టలు పెట్టాలని జగదీశ్వరి షరతు పెట్టటంతో చేతు లెత్తేశాడు వియ్యంకుడు.

"ఇప్పటికే చాలా ఖర్చైంది. అమ్మాయి బంగారం పట్టుచీరలకే రెండున్నర లక్షలయ్యాయి. హాలు, భోజ నాలు మూడు లక్షలు దాటాయి. పెళ్ళికొడుకు వియ్యం కుల బట్టలు ముప్పైవేలు దాటాయి. ఎ.సి.రూంలు, మిగతా పెళ్ళి ఖర్చులు అన్నీ కలిసి పది లక్షలయ్యాయి. ఇప్పుడు ఇంతమందికి బట్టలంటే మాటలా! జాకెట్ ముక్కలు పెడతాం" వేడుకున్నారు ప్రశాంతి తల్లిదం డ్రులు.

"మీకు చేతకాకపోతే చెప్పండి. ఆ పది లక్షల ఖర్చు నేనే పెట్టుకుంటాను. ఆ బిల్లులివ్వండి" అన్నది జగదీశ్వరి గర్వంగా.

ఆ డైలాగ్ కొట్టిన ప్రతిసారీ ఆడపెళ్ళివాళ్ళకి పౌరు షమొచ్చి జగదీశ్వరి కోర్కెలు తీరుస్తున్నారు. వియ్యం కుడికేమీ పాలుపోవటం లేదు.

"పెళ్ళికొచ్చిన అందరికీ ఎవరూ కూడా బట్టలు పెట్టరు" అని భర్త, కొడుకు చెబుతున్నా జగదీశ్వరి వినిపించుకోలేదు.

"ఆ బిల్లులివ్వండి నేనే చెల్లి స్తాను" అన్నది మరోసారి తలె గరేస్తూ.

జరిగేదంతా మౌనంగా గమనిస్తున్న ప్రశాంతి చప్పున ముందుకు కదిలింది.

"మా అత్తగారు దేవత నాన్నగారు. ఆ బిల్లులు అత్తయ్యగారు కడతారట. ఇవ్వండి" అంటూ తండ్రి దగ్గర నుండి బిల్లులు తీసుకొని అత్తగారి చేతిలో పెట్టింది.

ఊహించని పరిణామానికి బిత్తరపోయింది జగదీ శ్వరి.

హాలుకు, కేటరింగ్‌కు, ఎసిగదులకు అప్పటిక ప్పుడే అడ్వాన్స్ పోగా రెండున్నర లక్షల కట్టాల్సి రావ టంతో పరువునిలుపుకోవటం కోసం కట్టక తప్ప లేదు.

"మొత్తానికి మన జగదీశ్వరి ఇంట్లో పెళ్ళిసందడి ఎప్పటికీ గుర్తువుం టుంది"

"అత్తకుతగ్గ కోడ లొచ్చింది"

'ఇంతకూ ఇప్పుడు జగదీశ్వరి మనకు చీరలు కొంటుందా? లేదా?'

తమ కాలనీ ఆడవాళ్ళు అంటున్న మాటలు జగదీశ్వరికి విన్పిస్తున్నా నోరెత్తటం లేదు. నోరెత్తితే మళ్ళీ ఏ బిల్లు కట్టాల్సి వస్తుం దోనని భయం.

